క్లుప్తంగా

15న ఆలయ భూముల కౌలు రైతులతో సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ భీమ లింగేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు రైతులతో ఈనెల 15న సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు పెంపు విషయమై స్థానిక శివాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి హాజరు అవుతున్నట్లు తెలిపారు. దేవాలయ భూములను కౌలుకు చేసుకునే రైతులు తప్పనిసరిగా హాజరు రావాలని ఆయన కోరారు. కౌలు బకాయిలు ఉన్న రైతులు ఆ రోజు కౌలు చెల్లించాలని లేదంటే ఆ బకాయిదారులను తొలగించి బహిరంగ వేలం ద్వారా వేరే వారికి కౌలుకు ఇస్తామని ఆయన తెలిపారు.

నేడు కోదండ రామాలయంలో పంచామృతాభిషేకాలు

నేరేడుచర్ల : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల శ్రీకోదండ రామాలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీరామనర్సింహతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామివారికి అర్చన, పంచామృతాభిషేకం, నిరాజన మంత్రపుష్పం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ : విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించడానికి కృషిచేయాలని కోదాడ మండల విద్యాధికారి ఎండీ సలీంషరీఫ్ అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్‌- 17 వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన కోదాడ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.డి సాధిక్‌ను సోమవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థుల్లో ఉన్న అభిరుచులను తెలుసుకొని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సాధిక్ భవిష్యత్తులో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటే విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అశ్విని, మధు వేఘన

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అశ్విని, మధు వేఘన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు అండర్‌- 14 విభాగంలో ఎంపికయ్యారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని కోమరబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్‌-14 బాలబాలికల నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విరూపాక్ష, పీడీ సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిటీ అధ్యక్షుడిగా గొట్టం ప్రకాష్



గరిడేపల్లి : తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల జోనల్ కమిటీని హుజూర్‌నగర్ జోనల్ కమిటీ ఇంచార్జి మల్లికంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గరిడేపల్లిలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోనల్ కమిటీ అధ్యక్షుడిగా గొట్టం ప్రకాష్, గౌరవ అధ్యక్షుడిగా రామారావు, ఉపాధ్యక్షులుగా రేఖ వీరశేఖర్, కుర్రి కాశయ్య, ప్రధాన కార్యదర్శులుగా కొత్తపల్లి సంగీతరావు, డి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా గడ్డం వీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుండు వీరస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నందిపాటి భిక్షం, సోషల్ మీడియా అధ్యక్షుడిగా మచ్చ రమేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కామెర్లు.. పది రోజులు సెలవులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 25 మందికి పైగా విద్యార్థులకు పచ్చ కామెర్ల వ్యాధి సోకి ఇబ్బందులు పడుతుండడంతో పాఠశాలకు పది రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు ఎంఈఓ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామెర్ల వ్యాధి ఇతర పిల్లలకు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు పాఠశాల మూసివేసినట్లు ఆయన తెలిపారు.

బోగస్ హాజరుకు చెక్ పెట్టేలా..

'ఉపాధి'లో ఈ -కేవైసీ

- కూలీల ఆధార్, జాబ్‌కార్డు వివరాలు యాప్‌లో నమోదు
- ఫొటోలు కూడా ఆన్‌లైన్‌లో..
- గ్రామాల్లో కొనసాగుతున్న ఈ- కేవైసీ ప్రక్రియ



నడిగూడెంలో కూలీల ఫొటోలు, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఉపాధి సిబ్బంది



గరిడేపల్లిలో కూలీ ఫొటో నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

నడిగూడెం, గరిడేపల్లి : ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అధికారులు ఈ- కేవైసీ ప్రక్రియను చేపడుతున్నారు. ఈ విధానంలో ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులకు ఆధార్ కార్డు అనుసంధానం చేస్తున్నారు. అదేవిధంగా ముఖగుర్తింపు, కను పాపలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విధానంతో ఒకరికి బదులుగా మరొకరు పనికి వెళ్లడం లాంటి వాటికి చెక్ పడనుంది. ఇందులో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది కూలీ ఫేస్ ఐడీ, వివరాలు నమోదు చేస్తున్నారు. సంబంధిత కూలీల వివరాలను జాతీయ మస్టర్ పర్యవేక్షణ సంస్థ (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే గతంలో సంబంధిత కూలీలు పనులకు హాజరు కాకున్నా మస్టర్‌లు వేసి పలువురు సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారు. అలా జరగకుండా ఉండడానికి ఈకేవైసీ విధానాన్ని తీసుకొచ్చారు. ఇప్పటినుంచి చనిపోయిన కూలీల పేర్లు కూడా నమోదు చేసే అవకాశం ఉండదు. ఎలాంటి అక్రమాలకు తావు ఉండదని అధికారులు చెబుతున్నారు.

సాంకేతిక సమస్యలతో ఆలస్యం..

నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి గ్రామాల్లో మొత్తం 11,120 జాబ్ కార్డులున్నాయి. మొత్తం 21,196 మంది కూలీలుండగా 11,120 మంది కూలీలు నిత్యం పనులకు హాజరవుతున్నారు. కాగా ఇప్పటివరకు 64 శాతం మాత్రమే ఈ- కేవైసీ ప్రక్రియ పూర్తయింది. సిగ్నల్స్ లేక, సాంకేతిక సమస్యతో ఈ- కేవైసీకి ప్రక్రియ ఆలస్యమవుతోందని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. గత వారం రోజులుగా ఈ కేవైసీ ప్రక్రియం చేపడుతున్నప్పటికీ ఇప్పటివరకు 64 శాతం మాత్రమే కూలీల వివరాలు నమోదయ్యాయి.

గరిడేపల్లి మండలంలో ఇలా..

గరిడేపల్లి మండల వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీల పరిధిలో 17079 జాబ్‌కార్డులు ఉండగా 39451 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరిలో 25526 మంది యాక్టివ్ వర్కర్స్ ఉన్నారు. కాగా, మండలంలో 39376 మందికి ఈ- కేవైసీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 10150 మందికి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందని, వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

60శాతం ఈ- కేవైసీ పూర్తి



మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 60శాతం ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయింది. ఇప్పటి వరకు 15376 మంది ఉపాధి కూలీల వివరాలు నమోదు చేసుకున్నారు. మరో వారం రోజుల్లో ప్రక్రియ పూర్తికానుంది. ప్రతి ఉపాధి కూలీ తప్పనిసరిగా ఈ- కేవైసీని చేయించుకోవాలి. లేకుంటే ఉపాధి పనులకు హాజరయ్యే అవకాశం ఉండదు.

– రాయికింది సురేష్, ఏపీఓ, గరిడేపల్లి

ఈ నెల 20 లోగా పూర్తి చేస్తాం



మండల వ్యాప్తంగా వారం, పది రోజుల్లో ఉపాధి హామీ కూలీల ఈ- కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించాం. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా ఈ ప్రక్రియ చేస్తున్నాం. ప్రతి కూలీ తప్పనిసరిగా ఈ నెల 20 లోగా ఈ- కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే జాబ్ కార్డు రద్దు అయ్యే అవకాశం ఉంది. నకిలీ మస్టర్లకు చెక్ పెట్టేందుకు ఈ-కేవైసీ ఉపయోగపడుతుంది.

– రవీందర్, ఏపీఓ, నడిగూడెం

గుంతల రోడ్డుపై వాకర్స్ నిరసన



కట్టకొమ్ముగూడెం రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోదాడ : పట్టణ ప్రజలు ఉదయం వాకింగ్‌కు వెళ్లే కట్టకొమ్ముగూడెం రోడ్డు గుంతలమయంగా మారిందని, దీనికి తోడు వీధిదీపాలు కూడా వెలగక వాకర్స్‌తో పాటు ఈ రోడ్డులో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సోమవారం వెస్ట్‌జోన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రోడ్డుపై గల గుంతల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డు విషయమై తాము అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని విష్ణురామ్ థియేటర్ నుంచి బైపాస్ వరకు ఉన్న కట్టకొమ్ముగూడెం రోడ్డులో సుమారు మూడు కిలోమీటర్ల మేర అడుగుకో గుంత ఏర్పడిందన్నారు. ఉదయం నడకకు వెళ్తున్న సమయంలో వాహనదారులు గుంతలను తప్పించబోయి వాకర్స్‌ను ఢీకొడుతున్నారని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పారబోస్తుండంతో తీవ్ర దుర్వాసన వస్తుందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు మున్సిపాలిటీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థికసాయం



సైదులు భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

హుజూర్‌నగర్ : మండలంలోని అనుములగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్‌కె.సైదులు కుటుంబానికి లక్కవరం యూపీఎస్‌లో సైదులుతో పాటు కలిసి 7వ తరగతి వరకు కలిసి చదివిన చిన్ననాటి స్నేహితులు సోమవారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చామకూరి, నరసింహారావు, ఎస్.ఉపేందర్, ఎస్.నాగేశ్వరరావు, కే.రమేష్, పి.మధుచారి, బి.గోపయ్య, అబ్దుల్, రహీం, బాలసైదులు, గురవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ఉప తపాలా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

గరిడేపల్లి : ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డక్ సేవక్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు చలిగంటి పుల్లారావు అన్నారు. ఆల్ ఇండియా గ్రామీణ డక్ సేవక్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్‌ఎస్ మహాదేవయ్యను ఈ నెల 3న విధుల నుంచి తొలగించడాన్ని ఖండిస్తూ సోమవారం ఏఐజీడీఎస్‌యూ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆదేశానుసారం గరిడేపల్లిలోని ఉప తపాలా కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. యూనియన్ కార్యాచరణలో భాగంగా ఈ నెల 15న సూర్యాపేట డివిజన్ కార్యాలయం ఎదుట, 22న సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నాకు గ్రామీణ తపాలా ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు పెండెం తిరపతయ్య, షేక్ మహబూబ్ భాషా, ధారావత్ శ్రీనునాయక్, ప్రవీణ్, జీవన్ వనజ, శిరీష పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



గోపూజలో పాల్గొన్న భక్తులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ- కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలి



కీతవారిగూడెంలో ఈ- కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉపాధి కూలీల ఈ- కేవైసీ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఎంపీడీఓ సరోజ కోరారు. సోమవారం మండలంలోని కీతవారిగూడెంలో ఈ- కేవైసీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల వివరాలను ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ కేవైసీ ప్రక్రియ 60శాతం పూర్తయిందని పేర్కొన్నారు. ఉపాధి కూలీలు తప్పనిసరిగా తమ వివరాలు, కనుపాపలను నమోదు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉపాధి పనులకు హాజరయ్యే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కోదాడ: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీరంగాపురానికి చెందిన కుర్రి నర్సయ్య తన ద్విచక్ర వాహనంపై విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో నర్సయ్య కుడి కాలు మోకాలి వరకు తెగి దూరంగా పడిపోయింది. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో స్థానికులు 108 వాహనంలో అతడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పట్టణ ఎస్ఐ హనుమానాయక్ తెలిపారు.

ఆయిల్‌పామ్ క్షేత్ర సందర్శనకు హుజూర్‌నగర్ రైతులు



విజ్ఞాన యాత్రలో రైతులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలువురు రైతులు ఆయిల్ పామ్ తోటల సాగులో మెళకువలు తెలుసుకునేందుకు సోమవారం క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, దమ్ముపేట మండలాలలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను రైతులు సందర్శించారు. ఆయిల్ పామ్ రైతులతో ముఖాముఖి నిర్వహించి పంట సాగులో ఉండే కష్టానష్టాలు, దిగుబడి, అమ్ముకునే విధానాలను తెలుసుకున్నారు. అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో, వక్క, జాజికాయ, మిరియాలు, తమలపాకు తోటలను సందర్శించి రైతుల అనుభవాలు తెలుసుకున్నారు. దమ్ముపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిని ప్రదీప్తి, పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ అధికారులు జె.హరీష్, శశికుమార్, సాయి, శ్రీరామ్, క్షేత్ర సహాయకులు రైతులు పాల్గొన్నారు.


వర్షపునీరు నిలిచి.. రాకపోకలకు ఇబ్బంది



సీసీరోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని సీపీఎం కార్యాలయం సమీపంలో వర్షపునీరు సీసీ రోడ్డుపై నిలుస్తోంది. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆ మార్గంలో వెళ్లే ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు వెళ్లిన సమయంలో వర్షపునీరు మీద పడుతోందని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చేతికొచ్చే వేళ.. వర్షంతో ఆందోళన



పాలకవీడులో పాలుపోసుకుంటున్న వరి పైరు

పాలకవీడు : ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే దశలో భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు యూరియా కొరత, మరోవైపు చీడపీడల సమస్యలను అధిగమించిన రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మింగుడు పడడం లేదు. పాలకవీడు మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో రైతులు సన్నరకం వరి సాగు చేశారు. ఇవి ప్రస్తుతం పొట్ట, (ఈత దశ) వెన్ను బయటకు వచ్చే దశలో ఉన్నాయి. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే నష్టం జరుగుతుంది. అంకురం ఏర్పడే దశలో వర్షపు నీరు వరి పొట్టలోకి, గింజలోకి నీరు చేరితే నాణ్యత దెబ్బతిని ధాన్యం తాలుగా మారే అవకాశం ఉంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రిటైర్డు ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వాలి



రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

కోదాడ : ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే అందజేయాలని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. సోమవారం కోదాడలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో జరిగిన ఆ సంఘం కోదాడ డివిజన్ నాయకుల సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వ రంగ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా ప్రభుత్వం సౌకర్యాలను కల్పించాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, సంఘ నాయకులు రావర్తి రామనర్సయ్య, పానుగోటి కోటయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మౌలానా, ముత్తవరపు రామారావు, ఉమామహేశ్వరావు, జీఆర్‌కే మూర్తి, డీఎస్.స్వామి, వరలక్ష్మి, రాజేందర్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై విమర్శలు అర్థరహితం

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగా

మునగాల : బీసీ వర్గాల కోసం గత 40 ఏళ్లుగా నిరంతర పోరాటం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను విమర్శించే అర్హత సీపీఎం నాయకులకు లేదని, అర్థరహితమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పానుగోటి రంగా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, అగ్రవర్ణాలలోని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని 2004లో ఆమరణ నిరాహార దీక్ష చేపడితే ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశ పెట్టారని, దీంతో నేడు ఎంతోమంది పేద విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు అయి ఉజ్వల భవిష్యత్ పొందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా బీసీ వర్గాల అభ్యున్నతికి పోరాటం చేస్తున్న కృష్ణయ్యను.. ఏనాడు బీసీల కోసం పోరాటం చేయని పలువురు నాయకులు విమర్శించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సీపీఎం నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని, భవిష్యత్‌లో పునరావృతమైతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణయాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎక్లాస్‌ఖాన్‌పేటలోని పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

నడిగూడెం : పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షేక్.జానిపాషా, కర్నాటి శ్రీధర్ కోరారు. నడిగూడెం మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, ఎక్లాస్‌ఖాన్‌పేట తండాలో గల ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి, భాస్కర్, ఉపాధ్యాయులు ఉపేందర్, సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

25 నుంచి ఐద్వా జాతీయ మహాసభలు



మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు వెంకట చంద్ర, తదితరులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో వచ్చే జనవరి 25 నుంచి 28 వరకు జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకట చంద్ర కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆమె మహాసభల కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. ఐద్వా జాతీయ మహాసభలు రాష్ట్రంలో మొదటిసారిగా హైదరాబాద్ వేదికగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభకు వెయ్యి మంది ప్రతినిధులు ఆల్ ఇండియా పాట్రన్ బృందాకరత్‌తో పాటు జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజులు పాటు జరిగే మహాసభల్లో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ, మహిళా ఉద్యమాలకు దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఐ.త్రివేణి, నాయకురాళ్లు ఐ.లక్ష్మి, పి.లక్ష్మి, ఐ.ఆదిలక్ష్మి, ఎస్.లింగమ్మ, ఆర్.వరలక్ష్మి, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కూడలి గ్రామంలో మ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మోతె మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కూడలి గ్రామంలో పార్వతి పరమేశ్వర మ్యాక్స్ కొనుగోలు కేంద్రంలో సన్న వడ్ల కొనుగోళ్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు మధ్య దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులు స్వతఃగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నాణ్యమైన ధాన్యం అమ్మడం సంతోషమన్నారు. అనంతరం కూడలి గ్రామంలోని శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మేకల గురుకృష్ణ, బాలాజీ, మేకల శ్రీను, వేదం హరిప్రసాద్, గంగరబోయిన బాలకృష్ణ, తాల్లనల్లి మధు, ఉసిరికపల్లి రవి, మధుసుదనచారి, తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత రైతన్నకు చింత



గుంతలమయంగా దారి

మోతె : మండలంలోని సిరికొండ గ్రామం నుంచి ఆత్మకూర్ ఎస్ మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామం వరకు గల డొంక దారి అధ్వానంగా మారింది. ఐదు కిలోమీటర్ల మేర ఉన్న దారి గుంతలమయంగా మారడంతో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం అనునిత్యం ఈ డొంక దారిలో వచ్చివెళ్లే రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు చొరవ చూపి డొంక దారిని బీటీ రోడ్డుగా మార్చాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు యూరియా బుక్స్ పంపిణీ



చిలుకూరు పీఏసీఎస్‌లో రైతులకు యూరియా పంపిణీ బుక్స్ అందజేస్తున్న చైర్మన్, సీఈఓ

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. రైతులకు పంపిణీ చేసే ప్రతి యూరియా బస్తాను బుక్‌లో రాయనున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయ పొలాన్ని బట్టి యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల రైతులకు ప్రకటించిన తేదీల ప్రకారం బుక్స్ పంపిణీ చేస్తామని చైర్మన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు అలసకాని జనార్దన్, బజ్జూరి రవీందర్‌రెడ్డి, సీఈఓలు చిలువేరు లక్ష్మీనారాయణ, పాషా, డైరెక్టర్లు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.